క్లుప్తంగా

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భరత్‌కుమార్‌కు స్వర్ణం



మంగళగిరి: అంతర్ కళాశాలల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మంగళగిరికి చెందిన పంధిళ్ల భరత్‌కుమార్ స్వర్ణపతకం సాధించాడు. కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం జాకీర్ హుసేన్ కళాశాలలో ఈనెల 9,10 తేదీల్లో కృష్ణా యూనివర్సిటీ అంతర్‌కళాశాలల వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బాడీబిల్డింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో భరత్‌కుమార్ 66 కేజీల విభాగంలో పోటీల్లో పాల్గొని స్క్వాట్ 230 కేజీలు, బెంచ్ 115 కేజీలు, డెడ్‌లిఫ్ట్ 210 కేజీలు మొత్తం 555 కేజీల బరువునెత్తి బంగారు పతకం సాధించినట్లు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి గుమ్మడి పుల్లేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో భరత్‌కుమార్‌ను కోచ్ సంధానీతో పాటు పలువురు అభినందించారు.

ఆశ్రమం వద్ద భారీ బందోబస్తు

తాడేపల్లి రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆశ్రమాలను ముట్టడించేందుకు దళిత హక్కుల పోరాట సమితి పిలుపునివ్వడంతో మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం చిన్న జీయర్‌స్వామి ఆశ్రమం వద్ద తాడేపల్లి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆశ్రమాల్లో దళితులకు ప్రాధాన్య ఇవ్వడం లేదని, ఉద్యోగాల నుంచి తీసివేస్తున్నారని, తొలగించిన వారిని వెంటనే ఉద్యోగాల్లో చేర్పించుకుని కొత్తవారికి అవకాశం ఇవ్వాలని, లేదంటే జనవరి 10వ తేదీ ఆశ్రమాలను ముట్టడిస్తామని, సీతానగరంలో ఉన్న చినజీయర్‌స్వామి ఆశ్రమానికి రాత పూర్వకంగా దళిత హక్కుల పోరాట సమితి లేఖను పోస్ట్ చేయడంతో ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు, వచ్చిన లేఖ సారాంశంపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ శేషగిరిరావు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు ఎదురు ఎదురుగా వస్తున్న లారీ, కారు ఢీకొన్న ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని వేములూరిపాడులో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. నంద్యాల నుంచి గుంటూరు వైపునకు వెళ్తున్న కారు వేములూరిపాడులో ఎదురుగా వస్తున్న లారీ ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో 108 వాహనంలో వారిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు చికిత్సకోసం తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఎం.లక్ష్మీనారాయణరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పూర్తిస్థాయిలో వివరాలు అందాల్సి ఉందని చెప్పారు.

క్షేత్రస్థాయిలో మట్టినమూనాల సేకరణ

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ క్లస్టర్ పరిధిలోని వేములూరిపాడు గ్రామశివారులో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పంట పొలాన్ని మంగళవారం లాంఫాం శాస్త్రవేత్తలు పరిశీలించారు. గ్రామానికే చెందిన రైతు ఇ.వెంకటేశ్వర్లు వేసిన పత్తి పొలాన్ని పరిశీలించారు. ప్రతి 5సాళ్లకు ఒక కంది సాళ్ల వరుస, పది నుంచి 15 వరకు వివిధ రకాల అంతర పంటలు అయిన జొన్న, మొక్కజొన్న, సజ్జ, గట్లపై పూబంతి వంటివి పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంలో ఆచరిస్తున్న పద్ధతులు, ఆదాయ వ్యయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ క్షేత్రంలో మట్టి నమూనాలు సేకరించి వాటిని పరిశీలించనున్నట్లు శాస్త్రవేత్తల బృందం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శైలజ, ఎస్.వెంకటలక్ష్మి, రాజ్యలక్ష్మి, డివిజన్ ఇన్‌చార్జి అన్నామణి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంక్రాంతి ముగ్గులపోటీలు



ఫిరంగిపురం: మండలంలోని వేమవరం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు సంక్రాంతిని పురస్కరించుకొని ముగ్గుల పోటీ, విచిత్ర వేషధారణ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు 15 మంది ముగ్గుల పోటీల్లో పాల్గొనగా, విచిత్ర వేషధారణల్లో ఐదుగురు విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో గెలుపొందిన విద్యార్థులకు తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రామిరెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రీటామరియ, దివి కమల్ మోహన్ పాల్గొన్నారు.

కృష్ణా జలాలను నిరంతరం అందిస్తాం

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)



ఫిల్టర్ బెడ్ పనులపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లికి కృష్ణాజలాలను నిరంతరం అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పేర్కొన్నారు. నీటి సరఫరాకు చేపట్టిన పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ కృష్ణానది ఒడ్డున ఉన్న ఉండవల్లి ప్రజలు కృష్ణా జలాలను అందుకోలేకపోతున్నారని, ప్రజల అవసరాల నిమిత్తం కార్పొరేషన్ నుంచి కోటి 20 లక్షల రూపాయలు నిధులు కేటాయించి అధునాతన టెక్నాలజీతో ప్రెజర్ ఫిల్టర్ బెడ్‌లను 8 ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అందులో నిరంతరం 4 పనిచేస్తాయని, మిగిలిన నాలుగు అత్యవసర పరిస్థితుల్లో వినియోగిస్తామని అన్నారు. ఒక్కో ఫిల్టర్ బెడ్ నుండి గంటకు లక్ష లీటర్ల తాగునీరు వస్తుందని, కృష్ణానది నుంచి నేరుగా ఫిల్టర్ బెడ్‌ను నీటిని తీసుకుని అక్కడ శుద్ధి చేసి, అక్కడి నుంచి ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు, డైరెక్ట్ పంపింగ్ చేసే విధంగా ఇంజినీరింగ్ సిబ్బంది ప్రణాళిక సిద్ధం చేశారని, ఉండవల్లి ప్రాంతంలో ప్రస్తుత జనాభా 15 వేలు ఉండగా, మరో 20 ఏళ్లలో పెరిగే జనాభాకు అనుగుణంగా తాగునీరు సరఫరా చేసేందుకు ఫిల్టర్ బెడ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మరో 10, 15 రోజుల్లో పూర్తిస్థాయిలో ఉండవల్లి ప్రజలకు కృష్ణాజలాలు అందించనున్నట్లు ఆయన అన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణం పరిశీలన....

ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో నిర్మిస్తున్న రూ.కోటి 20 లక్షలతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆర్కే పరిశీలించారు. పనులు పూర్తికావడంతో త్వరలోనే ప్రారంభోత్సవం చేయనున్నట్లు ఆయన తెలిపారు. రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి రూ.70 లక్షలు కేటాయించగా, కార్పొరేషన్ నుంచి రూ.50 లక్షలు కేటాయించి నిర్మాణం పూర్తిచేశామని, పేద ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ధరను నిర్ణయించనున్నట్లు ఆయన అన్నారు.

శ్మశాన వాటిక గోడ నిర్మాణ పనులు..

ఉండవల్లిలో 10 లక్షల వ్యయంతో హిందూ శ్మశాన వాటిక గోడ నిర్మాణ పనులను కార్పొరేషన్ అధికారులు పరిశీలించారు. ఎమ్మెల్యే ఆర్కే ఆ గోడ నిర్మాణాన్ని పరిశీలించి, స్మశాన వాటికలో వెంటనే జంగిల్ క్లియరెన్స్ చేసి లెవలింగ్ చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమాల్లో కార్పొరేషన్ డి.ఇ. కృష్ణారెడ్డి, ఏఈలు కిషోర్, ప్రవీణ్, సెక్రటరీలు గోపాల్‌రెడ్డి, రాధాకుమారి, మంగళగిరిశివాలయం ట్రస్ట్‌బోర్డు మెంబర్ కొల్లు మునలారెడ్డి, వైఎస్సార్ సీపీ కుంచనపల్లి పార్టీ కన్వీనర్ మిరియాల రాంబాబు, మాజీ వైస్ ప్రెసిడెంట్ అమరా నాగయ్య, గద్దం తాతయ్య, కళ్ళం సాంబిరెడ్డి, తిరుమలరావు, బుర్రముక్కు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

మంగళగిరి: నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, నిర్మాణ పనుల్లో ప్రమాణాలను పాటించాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సూచించారు. నూతక్కి, నవులూరులో పలు అభివృద్ధి పనులను మంగళవారం పరిశీలించారు. తొలుత నూతక్కి గ్రామంలో రూ.80 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, సీసీ డ్రైయినేజి నిర్మాణ పనులను పరిశీలించారు.

అనంతరం డాక్టర్ వైఎస్సార్ వెటర్నరీ డిస్పెన్సరీ (పశువుల ఆసుపత్రి)ని పరిశీలించి పలు సూచనలు చేశారు. నూతక్కిలో జరుగనున్న వేణగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా నిర్వహించే రథోత్సవానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సిమెంట్ రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. హైటెన్షన్ విద్యుత్ వైర్ల వల్ల అరటిచెట్లు కాలిపోతున్నాయని పలువురు రైతులు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకురాగా వెంటనే సమస్యను పరిష్కరించాలని ఉన్నతాధికారులను కోరారు. అనంతరం నవులూరు టిడ్కో గృహ సముదాయానికి రూ.15లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రావెల్ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా వందల కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. నియోజవర్గ అభివృద్ధికి అడిగిన వెంటనే కోట్ల రూపాయలను కేటాయిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్ పాల్గొన్నారు.

సంక్రాంతి సెలవులకు ఊరు వెళుతున్నారా?

- అయితే పోలీసులకు సమాచారం ఇవ్వండి
- మీ ఇంటిని జాగ్రత్తగా చూస్తాం
- సీఐలు శేషగిరిరావు, సాంబశివరావు



విలేకరులతో మాట్లాడుతున్న సీఐలు శేషగిరిరావు, సాంబశివరావు

తాడేపల్లి రూరల్: సంక్రాంతి సెలవులకు సొంత ఊరు వెళుతున్నారా? అయితే తప్పని సరిగా తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చి వెళ్లాలని తాడేపల్లి సీఐలు శేషగిరిరావు, సాంబశివరావు కోరారు. మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాళాలు వేసిన నివాసాల్లో దొంగతనాలు జరక్కుండా నివారించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. దానిలో భాగంగా లాక్ చేసి ఊర్లకు వెళ్లే నివాసాల్లో లాక్‌డ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్) కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం మీ ఇంటిపై నిఘా ఉంచుతామని, ఎవరైనా ఊరు వెళితే వారి అడ్రస్, వివరాలు పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని, వెంటనే మా సిబ్బంది అక్కడకు చేరుకుని మీ ఇంట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని వారు స్పష్టం చేశారు.

దుమ్ముతో అవస్థలపై మహిళల ఆందోళన

మేడికొండూరు: క్వారీల దుమ్ముతో అనారోగ్యానికి గురవుతున్నామని ఆరోపిస్తూ మహిళలు మంగళవారం రోడ్డుపై బైఠాయించారు. మండలంలోని పేరేచర్ల డొంకలోని కొండ క్వారీ రోడ్‌లో క్వారీ, క్రషర్‌లకు చెందిన వందలాది లారీలు ఈ మార్గంలో రాకపోకలు వెళ్తున్నాయని, దీంతో దుమ్మురేగుతుండడంతో అవస్థలు పడుతున్నామని వారు పేర్కొన్నారు. పరిమితికి మించిన లోడుతో వెళుతున్న లారీల నుంచి రాళ్లు కిందకు పడటం ప్రమాభరితంగా మారిందని మహిళలు వాపోతున్నారు. గత నెల 8వ తేదీ జిల్లా స్పందనలో ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఘటనా స్థలాన్ని మేడికొండూరు సీఐ ఎండీకే ఆల్తాఫ్ హుస్సేన్ సందర్శించి ఆందోళనకారులతో చర్చించారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి



మత్స్యకారులకు వాహనాలు అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

తాడికొండ: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. మంగళవారం గుంటూరులోని మత్స్య భవనంలో తాడికొండ నియోజకవర్గ పరిధిలోని మత్స్యకారులకు ఐస్ బాక్సులతో కూడిన రూ.3 లక్షల విలువ చేసే ద్విచక్ర వాహనాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకార కుటుంబాలకు మేలు కల్పించేందుకు ప్రభుత్వం ద్వారా మత్స్యకార భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, పరికరాల పంపిణీ వంటివి మంజూరు చేస్తున్నట్లు చెప్పారు.

రంగస్థల కళాకారుడు సుబ్బారావుకు సన్మానం



సుబ్బారావును సన్మానిస్తున్న నాగభూషణం, మల్లిఖార్జునరావు

తెనాలిఅర్బన్: నందమూరి తారక రామారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో మంగళవారం వరకట్నం చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. బుధవారం శ్రీనాథ కవి సార్వభౌముడు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ సాంఘిక నాటక, రంగస్థల కళాకారుడు తాడికొండ సుబ్బారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మైనేని నాగభూషణం, వేములపల్లి మల్లిఖార్జునరావు, భట్టిప్రోలు రామమోహన రావు, అంకిశెట్టి కృష్ణమూర్తి, బోడపాటి మల్లిఖార్జునరావు, పెమ్మసాని పోతురాజు, ఈదర శ్రీనివాసరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, సోమవరపు సాంబశివరావు, కె.వి.సుబ్రమణ్యం, పాలడుగు శ్రీనివాసరావు, నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

• పొగతో ఉక్కిరి బిక్కిరి



ఊరి వెంబడి తగలబడుతున్న పంటపొలాల్లోని చెత్తా చెదారం

కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి గుంటూరు చానల్‌కు కరకట్టకు మధ్య ఉన్న పంటపొలాల్లో మంగళవారం మంటలు చెలరేగాయి. మంటలు ఎగిసిపడుతూ దట్టమైన పొగ రావడం, ఆ పొగ ఊర్లోకి వ్యాపించడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. ఉండవల్లి పంటపొలాల్లో మిషన్‌తో వరికోతలు కోసిన అనంతరం వచ్చిన చెత్తను ఓ రైతు తగలబెట్టగా చుట్టు పక్కల ఉన్న పంటపొలాల్లో ఉన్న చెత్తాచెదారం తగలబడి పొగ వ్యాపించడంతో పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి విచ్చేసి మంటలను అదుపుచేశారు. – తాడేపల్లి రూరల్

భూముల వివరాలపై అవగాహన ఉండాలి

జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి



రెవెన్యూ సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

ఫిరంగిపురం: ప్రభుత్వ, ప్రయివేటు భూములపై రెవెన్యూ సిబ్బందికి అవగాహన ఉండాలని జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వేములూరిపాడు గ్రామ సచివాలయాన్ని మంగళవారం కలెక్టర్ వేణుగోపాలరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో పలు రకాల రికార్డులు, సిబ్బంది హాజరు పరిశీలించారు. అనంతరం సచివాలయ పరిధిలో ప్రభుత్వ భూమి వాటి సర్వే నంబర్లు, అసైన్డ్ భూమి ఖాళీ స్థలాలు వంటి వాటి వివరాలపై సచివాలయ వీఆర్వోను ప్రశ్నించారు. సిబ్బందికి అవగాహన లేకపోవడంపై తహసీల్దార్ పద్మనాభుడిపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం జగనన్న గృహ నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయనే వాటిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు ఇంటి నిర్మాణాలు మొదలు పెట్టనివారు ఉంటే మొదలు పెట్టుకునేలా చూడాలని, లేకుంటే 90 రోజులలోగా ఇంటి స్థలం కోసం దరఖాస్తు పెట్టుకున్న వారికి కేటాయించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా వచ్చిన సమస్యలు నెల గడుస్తున్నా ఎందుకు పరిష్కరించలేదంటూ ఎంపీడీఓను ప్రశ్నించారు. టెండర్లు పిలిచే పని లేదుగా... చిన్నపాటి సమస్యలు పరిష్కరించడంలో అశ్రద్ధ వహించవద్దని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాలని పరిశీలించారు. మధ్యాహ్న భోజనం గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారం సక్రమంగా అందించేలా చూడాలని తెలిపారు. అనంతరం ఎంపీయూపీ పాఠశాలను పరిశీలించారు. సమస్యలపై యాప్‌లో పొందుపరిచిన వాటిని పరిష్కరిస్తున్నారా అనేదానిపై ఎంఈఓ సాల్మన్‌రాజ్‌ను ఆరా తీశారు. పాఠశాలలో తాగునీరు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని టాయిలెట్లు సరిగా లేవంటూ వెల్ఫేర్ అసిస్టెంట్ తెలపడంతో వాటిని గురించి పరిశీలించారు. వారంరోజులలోగా వాటిని సత్వరమే పరిష్కరించాలని ఎంఈఓ సాల్మన్‌రాజ్, పాఠశాల హెచ్‌ఎంను ఆదేశించారు.

అంటువ్యాధులపై అవగాహన కల్పించండి

జిల్లా మలేరియా అధికారి టీఎంకే సుబ్బరాయణం



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి టీఎంకే సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: అంటు వ్యాధులపై ప్రజలలో అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి టీఎంకే సుబ్బరాయణం సూచించారు. తెనాలిలోని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో మంగళవారం అంటువ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండటం వల్ల దోమల వ్యాప్తి పెరిగి అవి కుట్టటం వల్ల మలేరియా, డెంగూ, చికెన్ గున్యా, బోధకాలు, మెదడు వాపు వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒకరు శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి వ్యాధులపై అందరికీ అవగాహన కల్పించటంతో పాటు తీవ్ర జ్వరంతో బాధపడే వారిని గుర్తించి వారికి మలేరియా పరీక్షలు చేయాలని సూచించారు. అలాగే అలాంటి వారికి అవసరమైన మందులను పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ మలేరియా అధికారులు డి.రాజు నాయక్, వి.పున్నారెడ్డి, సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ నరసయ్య, వార్డు హెల్త్ సెక్రటరీలు, ఎఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్‌లు, ఆరోగ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

శ్రీవారి తెప్పోత్సవ ఏర్పాట్లపై సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న డీఎస్పీ, ఆలయ ఈఓ

తెనాలి: సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆరోజు పట్టణంలోని నిజాంపట్నం కాల్వపై నిర్వహించాల్సిన వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి తెప్పోత్సవ ఏర్పాట్లపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. డీఎస్పీ డాక్టర్ కె.స్రవంతిరాయ్, ఆలయ సహాయ కమిషనర్ ఎం.తిమ్మానాయుడు వివిధ విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, విద్యుత్‌శాఖల అధికారులతో 15వ తేదీన సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు జరిగే తెప్పోత్సవం నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

వైకుంఠపురం ఆలయం నుంచి విజయవాడ రోడ్డులోని డీఎస్పీ కార్యాలయం వరకు తెప్పోత్సవం ఘనంగా జరిగేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. వివిధ విభాగాల అధికారులు, సీఐలు కె.చంద్రశేఖర్, వెంకట్రావు, శ్రీనివాసులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఉండవల్లిలో గ్రావెల్ రోడ్ నిర్మాణం



తాడేపల్లి రూరల్: ఉండవల్లిలో కొత్తగా ఏర్పడిన ప్రాంతంలో నడవడానికి వీలు లేకుండా ఉన్న రహదారుల నిర్మాణాన్ని మంగళవారం కార్పొరేషన్ అధికారులు చేపట్టారు. ఉండవల్లి వినుకొండ అంకమ్మ గుడి వెనుక భాగంలో గత 5 సంవత్సరాల నుంచి భవన నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు ఎటువంటి రోడ్లు లేకపోవడంతో స్థానికులు స్పందన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్కేకు దరఖాస్తు అందించారు. వెంటనే స్పందించిన ఆయన కార్పొరేషన్ అధికారులకు గ్రావెల్ రోడ్లు నిర్మాణం చేపట్టాలని ఆదేశించడంతో డి.ఇ. కృష్ణారెడ్డి పరిశీలించి నాలుగు రోడ్లు గ్రావెల్ రోడ్ నిర్మించేందుకు పనులు చేపట్టారు.

నేడు చినకాకాని అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభం

మంగళగిరి: నగర పరిధిలోని చినకాకాని జాతీయ రహదారి వెంబడి రూ.1.30 కోట్లతో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ రోగులకు అందుబాటులోకి రానుంది. అర్బన్ హెల్త్ సెంటర్‌ను మంగళవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

గోదా అమ్మవారికి నీరాట్టోత్సవం



తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రిపై త్రిదండి చిన్న జీయర్‌స్వామి మంగళా శాసనాలతో మంగళవారం గోదా అమ్మవారికి నీరాట్టోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈనెల 14వ తేదీన గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవానికి పూర్వరంగంగా అమ్మవారికి నీరోట్టోత్సవాన్ని నిర్వహించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి అమ్మవారికి అభిషేకం(తిరుమంజనం), అలంకరణ, నివేదిన, గోష్టి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అపరాధ రుసుం వసూలు

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని కృష్ణనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ శాఖ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. అమరావతి ఏడీ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆరుగురు ఏఈలు, 72 మంది సిబ్బంది ఏకకాలంలో 3,212 విద్యుత్ మీటర్లను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో అధిక లోడ్ వాడుతున్న 122 మందికి 7 లక్షల 38 వేల రూపాయలు అపరాధ రుసుం విధించినట్లు కృష్ణనగర్ ఏఈ షణ్ముఖ తెలిపారు. ఎవరైనా విద్యుత్ చౌర్యం చేస్తే విద్యుత్‌శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు.

బోరుకు మరమ్మతులు

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండలో పాడైపోయిన బోరు పంపులను మరమ్మతులు చేసేందుకు కార్పొరేషన్ సిబ్బంది మంగళవారం నుంచి పనులు చేపట్టారు. ఇటీవలి కాలంలో ఎమ్మెల్యే ఆర్కేకు బోరు పంపుల మరమ్మతులపై కొలనుకొండలో స్థానికంగా ఉండే మహిళలు వాట్సప్ మెసేజ్ చేయడంతో స్పందించిన ఆయన మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు.

డోలాస్‌నగర్‌లో పైప్‌లైన్లకు..

డోలాస్‌నగర్‌లో తాగునీటి కోసం గతంలో ఏర్పాటు చేసిన జీఐ పైపు లైన్లు పలుచోట్ల మరమ్మతులకు గురై తాగునీరు వృథా పోవడంతో వాటిని గుర్తించిన సచివాలయం సిబ్బంది మంగళవారం కార్పొరేషన్ అధికారులకు తెలిపారు. వెంటనే స్పందించిన డి.ఇ. కృష్ణారెడ్డి మరమ్మతులు చేయాలని సూచించడంతో సచివాలయ ఇంజనీరింగ్ సిబ్బంది ధనలక్ష్మి, పైప్ లైన్లు పగిలిన పోయిన చోట వెల్డింగ్‌లు చేయించి తాగునీటిని పునరుద్ధరించారు.

యోగ మాస్టర్ మృతి

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లికి చెందిన ప్రముఖ యోగ మాస్టర్ ఎం. గంగాధర్ మంగళవారం మృతి చెందారు. ఉండవల్లి చుట్టు పక్కల ప్రాంతాల్లో గత 20 ఏళ్ల నుంచి ఎంతోమందికి యోగ నేర్పించారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

క్యాషియర్‌పై దాడి

తెనాలిరూరల్: బార్ అండ్ రెస్టారెంట్ క్యాషియర్‌పై ముగ్గురు యువకులు దాడి చేసి గాయపర్చారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణ శాలిపేటలోని సాయి బాలాజీ బార్ అండ్ రెస్టారెంట్‌కు సోమవారం రాత్రి ముగ్గురు యువకులు వచ్చారు. బార్ యజమాని ఫోన్ నంబరు కావాలంటూ క్యాషియర్ వాకా దుర్గా ప్రసాద్‌ను అడిగి అతనిపై దాడి చేశారు. బాధితుడు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి పోలీసులు నిందితులను బండి ప్రేమ్‌కుమార్, ఖాజా, వీరి స్నేహితుడు మరో యువకుడిగా గుర్తించారు.